# పులి

రంగనాధం డాము పక్కని కూచున్నాడు. నీరు ఉంగలు చుట్టుకుంటూ డాము ఇవతలకి దూకుతోంది. కాలవ అవతల జనపచేలు పచ్చగా పూసి ఉన్నాయి. పొరుగూరు సంతనించి జనం తిరిగి వస్తున్నారు.

రంగనాథానికేమీ తోచడం లేదు. ఈసారి అతనికి ఆ పల్లెటూరు దిగులుగా ఉంది. అందులో పొద్దున్న పుల్లి గొడవ చూచినప్పటినించీ.

పుల్లి అతని తాతగారి ఇంట్లో దాసి—అతని చిన్నతనంనుంచీ కూడా. ఇంట్లోమనిషికన్నాఎక్కువగా ఉండేది. అతని చిన్నతనంలో ఎత్తుకుతిరిగేది—అతనికి పాలు ఇచ్చిందట కూడాను; అతని తల్లి చెపుతూ ఉంటుంది. పుల్లి నవ్వితే చాలు ఇంట్లో పిల్లలందరూ ఏడుపులు మానివేశేవారు. ఒక్కసారి పుల్లి ఎత్తుకుని నలిపి పారేస్తే (పుల్లి మెల్లగా ఎత్తుకోదు; ముద్దుగా ఇటూ అటూ ఊపేస్తూ కితకితపెడుతూ ఎత్తుకుంటుంది) పిల్లలు పకపక నవ్వుతారు. ఆమె కలకలలాడుతూ వస్తుంది. ఆమె మరుకుగా చలాకీగా చూస్తుంది. నలభయి ఏళ్లు పైబడ్డా ఆమెలో మరుకు తగ్గలేదు. రంగనాథం మేనమామల ఇంటికి రావడానికి పుల్లి ఒక పెద్ద ఆకర్షణ. ఆమెతో ఎన్నాళ్లయినా అతడు కబుర్లు చెపుతూ గడిపేవాడు. అందుకని మేనమామల ఊరంటే అతనికి ఎంతో సరదా ఇన్నాళ్లూనూ.

పొద్దున్న అతను కళ్లారా చూసిన గొడవంతా అతని మనస్సులో అల్లకల్లోలంగా నిండి ఉంది. అతనికి అన్నిటి మీద కోపంగా ఉంది. పుల్లిమీద, పిల్లెంకడిమీద ఆ ఊరుమీదా, పుల్లి మొగుడుమీదా.

పుల్లి మొగుడు దూరాన్ని కనబడ్డాడు. తలమీద మూట ఎత్తుకుని కాలవమళుపు తిరిగాడు. దారి పక్కని ఉన్న మర్రిచెట్టు కింద ఎవరితోనో ఒకక్షణం మాట్లాడాడు. పక్కని బియ్యపు మర ఆఖరి పొగ గుప్పుగుప్పున వొదిలి ఆవేళకి పని చాలించింది. ఇంతలో పుల్లి కూడా కాలవమళుపులో కనబడింది. మొగుడూ, పెళ్లామూ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు—ఎల్లా చెప్పుకో గలుగుతున్నారో అతనికి ఆశ్చర్యం వేసింది; ఇంత గొడవయాక.

పిల్లెంకడు అతని పక్కని వచ్చి కూర్చున్నాడు. పాలు పితికి అప్పుడే దూడల్ని వొదిలాడు. వెనకఉన్న పశువుల సావడిలో దూడల కాళ్ల చప్పుడు,

పొదుగుల కోసం వాటి అట. ఆవుల ఆకలి అరుపులు రంగనాథం విన్నాడు. వెనక్కి తిరిగి చూశాడు. ఎర్రటి సంజ ఎండ మామిడి తోట మీద పాకింది. పచ్చి మామిడి కాయలు ఆ వెలుగులో స్పష్టంగా స్ఫుటంగా కనబడుతున్నాయి. పిల్లెంకడి గుడిసెలోంచి పొగ లుంగలుగా ఆకాశంలోకి వ్యాపిస్తోంది.

పిల్లెంకడి వేపు చూశాడు. పిల్లెంకడు నలభయి ఏళ్లు దాటినా నవ్వు మొగంతో అప్పుడే పెళ్లయిన కుర్రవాడిలా ఉంటాడు. సరదాగా నిర్లక్ష్యంగా చుట్ట కాలుస్తో చూస్తాడు. అతడు పుల్లీ. పుల్లి మొగుడూ సంత నించి వస్తుండడం చూశాడు.

"రంగన్న బాబో! సంకురేత్తిరికి రాలేదేం? మామయ్య సాలా సూశాడు నువ్వూ అమ్మాయీ వొత్తారేమోనని."

"వీల్లేకపోయింది. అమ్మకి వొంట్లో బాగాలేదు" రంగనాథం విసుగ్గా అన్నాడు. ఆ ప్రశ్న అతను వచ్చిన తరవాత ఈ రెండు రోజుల్లోనూ అందరూ తలొకసారీ అడిగారు. మొదట అత్తయ్య. తరువాత మామయ్య. పుల్లి. పుల్లి కూతురు. అంతానూ.

పుల్లీ, పుల్లి మొగుడూ దగ్గరగా వొచ్చారు. పుల్లి మొగుడు ఆగకుండా తిన్నగా వెళ్లిపోయాడు. పుల్లి ఆగింది. అంది :

"అబ్బాయి; తలంటోసుకుందూగాని నడు. పొద్దోతంది."

పుల్లి చిన్నప్పటి నించీ అబ్బాయనే పిలిచేది. ఆవేళ మాత్రం రంగనాథని కేదో వెగటుగా అనిపించింది ఆ పిలుపు.

"ఈవేళొద్దు. రేపు పొద్దున్న. నువ్వెళ్ళు. నేను వెనకాలొస్తాను."

పుల్లీ, పిల్లెంకడూ ఒకరివైపొకరు చూచుకున్న చూపు అతడు చూశాడు. ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. ఈ లోకంలో సిగ్గు అనేది ఎక్కడా లేదా అనిపించింది అతనికి.

"అమ్మాయ సూత్తుంటది నీ కోసం" అంటూ పుల్లి వెళ్లిపోయింది. ఇదివరకెన్నోసార్లు పుల్లి అటువంటి మాటలు సరదాగా అంటుండేది కాని ఈవేళ అంతా తలక్రిందుగా అయిపోయింది.

అతన్నీ, అతని భార్యనూ పుల్లి చిన్నప్పటినించీ ఎత్తుకు తిప్పింది. చిన్నప్పుడే ఇద్దరిచేత తమాషా మాటలన్నీ అనిపించేది. పెళ్లి అవుతుందని ఆమె చిన్నప్పుడే నిశ్చయించుకుంది. తన తల్లికీ, తన మేనమామకీ, అత్తకీ, అందరికీ ఆమే చివరకి అంతా నచ్చ చెప్పింది. పెళ్లంతా పుల్లి చేతిమీద జరిగినట్టుగా జరిగిపోయింది. పుల్లి లేకపోతే రంగనాథానికి తన మేనమామల ఇంట్లో సగం సరదా లేదు. తన తల్లికీ, తన మేనమామకీ దెబ్బలాట వచ్చిన నాటినించీ పుల్లి తప్ప అతనిక ఊళ్లో ఇంకో ఆత్మబంధువు ఎవరూ లేరు. తల్లికంటే ఎక్కువగా చనువయింది ఆమెతో.

అతను లేచి ఇంటివేపు బయలుదేరాడు. సన్నటి కాలవ గట్టు మీద ఎదురుగా దూడల మంద వస్తోంది. అతను కాలవ వాలులోకి తప్పుకుని నిలబడ్డాడు. మధ్య ఒక పెద్ద గిత్తదూడ చెవులు ఎత్తి అతనివేపు బెదురు చూపులు చూసింది. పెద్ద మూపురం. దాని మీద నల్లని మచ్చ. పొట్టిగా అగుపించీ అగుపించని కొమ్ములు. చొంగకారే నల్లటి మూతి—గిత్త వింతగా ఉంది. చటుకుని దానికి ఉద్రేకం వొచ్చి ముందు నడుస్తున్న ఆవును కుమ్మింది. మంద మందంతా ముందుకి పరుగెత్తింది. వెనక నడుస్తున్న పాలికాపు మోటకర్రితో గిత్తను కొట్టాడు. మంద వెళ్లిపోయింది.

రంగనాథం పొద్దున్న జరిగినదంతా జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

పొద్దున్నే అతను బయలుదేరి పొలంవేపు వస్తున్నాడు. ఈడిగపాలెంలో ఒక పెద్దగుంపు అడ్డదిడ్డంగా నిలబడీ, కూర్చునీ ఉన్నారు. అతని కసలు గుంపులంటే అసహ్యం. తప్పుకొని ఇంకో దారివెంట పోదామనుకున్నాడు.

ఇంతలో పుల్లి ముఖం కనబడింది. ఆమె పక్కని పిల్లెంకడున్నాడు. ఈడిగ పెద్ద ఒక ఎత్తు అరుగుమీద కూర్చున్నాడు. గుంపుకి ఇవతలగా మూడు కావిళ్లతో కొత్త కల్లు ఉంది. రంగనాథం కుతూహలం కొద్దీ ఆగి నిలబడ్డాడు. పుల్లి మొగుడు నిలబడి చెపుతున్నాడు :

"అదేమో, మొన్న సందేల మా అయ్యగారి పొలం పోయింది. ఎంచేపుటికీ రాకపోతే నాకు ఇసుగేసింది. పెద్ద కుర్రది మంచంమీదుంది. సిన్న కుర్రదానికి వొంటరాదు. డాముకాడ తోటలో మామయ్యగారి దూళ్ల సాలుంది. అక్కడ కెల్లాను. సీకటడతంది. అప్పుడు సూశేనండి."

అతని ముఖం మొద్దులా ఉంది. అతని మాటల్లో ఉద్రేకం ఏమీలేదు. అతని చూపులో కోపంలేదు. తనని అనవసరంగా ఇంతమందీ నిలబెట్టి బాధ పెడుతున్నట్టుగా అ స్తిమితంగా నిలబడ్డాడు.

"ఏటి సూత్తా?" పెద్ద అడిగాడు.

"అదిన్నీ........"

"అదెవరు?"

"మా పుల్లి అదీనీ, పిల్లెంకడూ సీకట్లో గడ్డిమేటి పక్కని దగ్గిరగా కూకుని ఉన్నారు. అదేమో దాన్ని పక్కలో యేలెట్టి పొడిచాడు. అది నవ్వింది."

"నువ్వేం చేశా?"

"ఏం చెయ్యమంటారు? కోపంగా 'రా! ఇంటికి రా. డొక్కలిరగ దంతాను' అన్నాను".

"ఇరగదన్నవా?"

"లేదండీ! యెల్లా గిరగదన్నను?"

అందరూ పక్కున నవ్వారు. పుల్లీ, పిల్లెంకడూ కూడా నవ్వారు. పిల్లి మొగుడు కంగారుపడి తనూ నవ్వి కూర్చున్నాడు.

రంగనాథానికి చటుకుని పడిపోయి బొప్పి కట్టినంత బాధ పెట్టింది. పుల్లి ఇల్లాంటిదని అతనికి ఇంతవరకూ తెలియదు. అతడు తొందరగా పొలం పోయాడు. కాని అతని మనస్సంతా కలిగిపోయింది.

పదిగంటలవేళ మళ్లీ ఇంటికి బయలుదేరాడు. ఆ దారిని వెళ్లకూడ దనుకున్నాడు. పక్కసందులోంచి ఇంటికి మళ్లబోతుంటే అవతల పెద్దగోల అవుతోంది. అతనికి కుతూహలం ఆగింది కాదు. సందులోంచి మళ్లీ ఒక ఇంటి అరుగు పక్కనించి తొంగి చూశాడు. అందరూ ముంతలతో కల్లు తాగుతున్నారు. ఆడ, మగ ఒకళ్లమీద ఒకళ్లు పడి గెంటుకుంటున్నారు. ఆ దృశ్యం చూసేసరికి అతనికి అసహ్యం వేసింది. ఇంత నీచమయిన స్థితికి మనిషి దిగిపోవడం అతను ఇంతవరకూ చూడలేదు. పుల్లీ కల్లు అందరికీ పోస్తూ తనూ తాగుతోంది. ఈడిగ పెద్ద ఆమె వెనకాలే వచ్చి తూలుతూ ఆమె మీద పడ్డాడు. ఆమె తప్పించుకుంది. అతడు ముంతతో కూడా కింద పడి పోయాడు. ముంత చితికిపోయింది. అందరూ పక్కున నవ్వారు. పుల్లీ ఇంకో ముంతతో అతనికి కల్లు ఇచ్చింది. ఆమె ఒకచూపు జూసేసరికి అతని కోపం మాయమయిపోయింది. పుల్లీ మొగుడు చేతిలో ముంతతో కునికి పాట్లు పడుతో గోడపక్కని కూర్చున్నాడు. పిల్లెంకడు అందరిమధ్యా తిరుగుతూ ఏవో పాటలు పాడుతున్నాడు. రంగనాథం ఇంటికి మళ్లిపోయాడు. ఇంతలో నరసన్న అతన్ని చూసి పరుగెత్తుకునివొచ్చి నమస్కరించాడు. అతడంత బాగా తాగలేదు. రంగనాథం ఏమీ ఎరగనట్లు అడిగాడు.

"ఏమిటీ గొడవ?"

"పుల్లీకీ, పిల్లెంకడికీ తప్పేశారండి."

"ఎందుకు?"

"ఎందుకేటండి బాబూ! తమకి తెలియని దేముంది? ఆడికీ దానికీ సంబంద ముందండి."

"ఎన్నాళ్ల నించి?"

"అబ్బో! శాన్నాళ్ల నించండి."

నరసన్న అతని పక్కనే నడుస్తో వస్తున్నాడు. రంగనాధానికి ఇంకే మదగాలో తోచలేదు. ఇంకా ఏదో తెలుసుకోవాలని అతనిలో ఒక పక్క కుతూహలం మాత్రం లేకపోలేదు.

"ఇంత ఇల్లాంటిదని నేనెరగను."

"అయ్యబాబు! దానికేమండి? ఏదో ఒకో లోటుంటదనుకోండి. ఎవ రికి లేదు సొప్పండి? మరి పుల్లంటే పుల్లే. దానికి సాటెవరొత్తారు?"

"అయినా ఇటువంటి పనే? మంచీ చెడ్డా ఉండొద్దూ?"

"అల్లాగంటే ఎల్లాగండి బాబూ? దాని మొగుడు సూశారా? మీ తాతయ్య కట్టిపెట్టేరు దానికి. ఆడికి బుర్రలేదు. ఎందుకూ పనికిరాడు. మరిం కది ఏం జేత్తాది సొప్పండి? ఆడు వట్టి రాయి. అయినా బాబూ! ఒకోనాడు ఏమీ అనలేవండి. సుక్క బాగా తగిత్తే ఇంక వొళ్లు తెలదు. అల్లాంటప్పు డింక నీదీ నాదీ అన్నమాటుండదు బాబయ్యా! ఏమయితేనేం, పుల్లిలాంటి మనిషి మళ్లీ లేదు. ఎన్నిలోకాలెతికినా సరే. అదల్లా నడిత్తే సాలు. ఒక్క సూపు సూత్తే సాలు."

"మరి ఇన్నాళ్లబట్టీ ఈ సంగతి తెలియకే ఊరుకున్నారా?"

"దాని మొగుడొచ్చి పెద్ద దగ్గర అల్లరి పెట్టాడండి. పెద్ద ఇయ్యాల ఊరు పోతున్నాడు. అందుకని పొద్దున్నే కూడగట్టాం"

రంగనాథం ఇదంతా ఆలోచించుకున్నాడు. తనకివన్నీ తెలియవు గనుక పుల్లిని గురించి గొప్పగా అనుకున్నాడు ఇన్నాళ్లూనూ. ఇవన్నీ తెలిసినవాళ్లంతా పుల్లిని అంత గొప్పగా పొగుడుతారెందుకు? వాళ్లంతా నీచులు. నీతీ అవినీతీ లేవనీ రంగనాథం నిశ్చయించుకున్నాడు.

ఇంటికి వచ్చిన తరువాత అతని భార్య తలంటు పోసుకోమని ఎంతో బలవంతం చేసింది. అతను పోసుకోనని మొండిపట్టు పట్టాడు. అతడు దక్షిణపు పెరట్లో మల్లెపందిరి పక్కని మంచం వాల్చుకుని పడుకున్నాడు. గోడ అవతల వైష్ణవుల ఇంట్లోంచి ఏదో కమ్మని వాసన కొట్టింది. మంచం అడుగుని అప్పుడే నీరు జల్లిన నేల మత్తుగా వాసన కొట్టింది. మల్లెపువ్వులు స్వచ్ఛంగా, చల్లగా, తెల్లగా, ఒత్తుగా పూశాయి. రంగనాథం చాలా చిరాకుగా ఉన్నాడు. పుల్లి వచ్చి మంచం పక్కని నిలబడింది. అతడు లేచి కూర్చున్నాడు.

"రా బాబూ! తలంటుసుకుందూగాని" అని మెల్లగా బలవంత పెడుతున్న గొంతుకతో అంది పుల్లి.

"నేను పోసుకోను" —రంగనాథం మళ్లీ పడుకున్నాడు. పుల్లి అతని చెయ్యి పట్టుకుని మందలిస్తున్నట్టు లేవదీసింది.

"మీ మావయ్యకాడ పేశీ పెట్టు. అంతేగాని నా దగ్గరే? లే. లే. నీళ్లు మరిగిపోతున్నాయి." ఆమె అతనింక వస్తాడన్నట్టు ధీమాగా వెళ్లిపోయింది. రంగనాథానికి లోపల చాలా చిరాకుగా ఉంది. ఆమె చనువూ, ఆమె బలవంతం, ఆమె ధీమా అతనికి చాలా కోపం కలిగించాయి. అయినా అతను లేచాడు. తువ్వాలు కట్టుకుని నీళ్లసావడిలోకి వెళ్లాడు. అతని భార్య, పుల్లీ అక్కడన్నీ సిద్ధంచేసి అతనికోసం ఎదురు చూస్తున్నారు. తలంటుతో పుల్లీ ఏవో మాట్లాడింది. అతని తల్లిని గురించి అడిగింది. చిన్ననాటి కబుర్లు

ఎన్నో చెప్పింది. రంగనాథానికి ఏదో దుఃఖం గొంతుక దాకా పొంగింది. కాని, అతను ఏమీ సమాధానం చెప్పలేదు. పుల్లి స్పర్శకు అతని శరీరం మైలపడిపోయినట్టు ముడుచుకు పోయింది. తక్షణం లేచి ఎవరినో ఒకర్ని ముక్కుమీద నెత్తురు వచ్చేలాగ గుద్దాలనిపించింది. కాని అతను చెయ్యీ కాలూ కదపకుండా అల్లాగే తలంటించుకున్నాడు.

అతనికి ఆ వేళ భోజనం సహించలేదు. అతడు అల్లుడితనం సాగిస్తున్నాడని మేనమామ అనుకున్నాడు. అన్నాడు కూడా అల్లాగని.

"ఏరా! మా మీద కోపమొస్తే వొచ్చింది. తిండి సరిగ్గా తిను."

"కోపం ఎవరిమీద?"

"ఏమోలే. మీ అమ్మకి ఒచ్చిందిగా నా మీద."

రంగనాథం ఇంకేమీ సమాధానం చెప్పలేదు.

భోజనం అయిన తరవాత మళ్లీ దక్షిణపు పెరట్లో మంచం మీద పడుకున్నాడు. చీకట్లో అతనికి ఆకాశం ఒకటే కనబడుతోంది. మల్లెపువ్వుల వాసన ఏదో పూర్వలోకాన్ని స్మరణకు తెస్తోంది. అతనికి తక్షణం ఆ ఊరు వదలి ఎక్కడికో పోవాలనిపించింది.

పుల్లి ఒక చేత్తో దీపమూ, రెండో చేత్తో ఇంకో పట్టె మంచమూ పట్టుకువచ్చింది. అతని మంచం పక్కని వాల్చింది. దీపం గుమ్మంమీద పెట్టి, రెండు పరుపులు రెండు చంకల్లోనూ మోసుకు వచ్చింది. వాల్చిన మంచంమీద పక్క వేసింది. రంగనాథం కదల్లేదు. ఆమె దగ్గరగా వచ్చి నిలబడింది.

"లే, అంది మీద పడుకో. పక్కేస్తాను."

అతను సమాధానం చెప్పకుండా పక్కవేసిన మంచంమీదికి దొర్లాడు.

ఆమె రెండో మంచం మీద పక్క లేస్తో ఉంటే అతని భార్య గుమ్మంలో వచ్చి నిలబడింది. పక్క వెయ్యగానే వచ్చి పక్కమీద కూర్చుంది.

"ఏమండీ, పుల్లీని మన ఊరు తీసుకుపోదామా?" అంది.

పుల్లీ మంచం పక్కని కూర్చుంది. రంగనాథం సమాధానం చెప్ప లేదు.

"మట్టాడు. రంగన్నబాబు! మేమెందుకు పనికొస్తాంలే. పట్టవోసం మరి. అమ్మాయి గనుక మా మీద అల్లాగుంటది." ఆమె అమ్మాయిని నిమిరింది. అమ్మాయి పడుకుని పుల్లీ చెయ్యి బుగ్గమీద పెట్టుకుంది.

"నువ్వెందు కొస్తావు? నిన్నసలు మామయ్య వొదుల్తాడా? అదీగాక నీకెన్ని ఉన్నాయి.... ఓ పక్కని పిల్లెంకడు!" అతను ఆఖరి ముక్క చాలా ఎత్తిపొడుస్తున్నట్లుగా. కోపంగా అన్నాడు.

"సాల్లెద్దూ! నేర్చుకుపోయావు. యాలాకోలంగాదు మరి. నువ్వు రమ్మను. నేనిప్పుడు నీ కూడా వొచ్చేత్తాను."

"అంత నే నీరాత్రే ప్రయాణమయి వెళ్ళిపోడం లేదులే." మొత్తం మీద రంగనాధానికి తనేదో కానిమాట అని పుల్లీకి లోకువయిపోయినట్టు అనిపించింది. ఆతనసలు పిల్లెంకడి గొడవ ఎత్తకుండా ఉండవలసింది.

"పుల్లీ, మరేం. అత్తయ్య ఒక పెద్ద గంగాళం కొందే. పొద్దున్నే దాన్నిండా నీళ్లుపోసి ఉంచుకుంటాం. సాయంత్రందాకా సరిపోతాయి."

"అమ్మని ఓసారి తీసుకురా అబ్బాయి. లేకపోతే నన్ను తీసికెల్లినా సరే. తోడబుట్టాళ్ళకి ఇల్లా మాటామంతీ పెడిపోడం బాగుండదు. నే కలుపు తాను. నేనిల్లా గన్నానని అమ్మతో అను."

"మామయ్య పోనీ రమ్మని రాయకూడదూ? అంత పట్టుదలెందుకు?"

"రాస్తే వొస్తుందా ఏమిటి? ఇద్దరికీ పట్టుదలే. ఇందులో తక్కువ వాళ్లెవరు?" అంది అతని భార్య. సంభాషణ అకారణంగా చనువులోకి దిగి పోతోంది. అతను నిద్రవొస్తున్నట్టు నటించాడు. పుల్లీ అతనివేపు చూసింది. అతను కళ్లు మూశాడు.

"అంతే. నేనింక అవతలకి ఎల్లిపోవాలన్నమాట. పట్టవోసంలో శానా నేర్చుకున్నాడు బాబు. మాట్టాడతా మాట్టాడతా కన్ను మూత్తన్నాడు. సూశావా అమ్మాయి? అమ్మాయి కేమీ తెలదు. యెర్రి మాలోకం!" పుల్లీ అమ్మాయిని ప్రేమగా దగ్గరగా తీసుకుంది

"రంగన్నబాయి పెద్దోడయాడు. పిన్నప్పు డత్తమానూ యేడుపే నాయన. ఎత్తుకోలేక సేతు లడిపోయేవి. పెద్దోడయి పెద్దపనిలో కెత్తే ఎంతెల్లా మారిపోతారో సూడు మొగోళ్లు....అయినా రంగన్నబాబు రంగన్న బాబే. వొజ్జిరం మాణిక్యం ఏం బాబు! ఓశ్, నిద్ర! .... పోతన్నాను. పెద్ద కుర్రదానికి జొరం, అమ్మాయి! పోతాను. పురుగూ పుట్రా వొత్తాయి. దీపం కిటికీలో పెడతాను. రంగన్నబాబు! మా పిల్ల మంచిదేనా? అబ్బో! నిద్ర! పెళ్లికి ముందు నువ్వన్న మాటలన్నీ నాకు గురుతున్నాయిలే. ఏం బాబూ! ఏడాదిదాకా ఈ ఊరు రాకుండా ఎల్లాగున్నా? మా ఊసు మరిచి పోయావా? పోతాను.........పొద్దున్నే రావాలి."

పుల్లీ వెళ్లిపోయింది. రంగనాధం కళ్లు విప్పాడు.

"నిద్దరొస్తోందా?" అంది అతని భార్య.

"ఊ!" అని కళ్లీ కళ్లు మూశాడు.

అతని తలకింద దిండ్లు సరిజేసి ఆమెకూడా అతని పక్కని పడుకుంది.

అతనికి ఎన్నో దృశ్యాలు జ్ఞాపకం వొచ్చాయి. ఇదివరకు దాకా పుల్లీ అతనికి ఆరాధ్యదేవత. ఆమెతో అతడు చెప్పని రహస్యం లేదు. దేనికయినా సరే ఆమెమీద ఆధారపడేవాడు. ఆమెతో చెప్పుకుంటే అతని మనస్సుకో

బరువంతా తీరిపోయినట్టుండేది. ఇక్కడికి వచ్చేముందు ఎన్నో ఆమెతో మాట్లాడాలనుకున్నాడు. తన తల్లికీ, తన మేనమమకీ మధ్య మనస్పర్థలు పెరిగిన తరువాత అతని పరిస్థితి ఇరుకులో పడింది. తన భార్యకీ, తన తల్లికీ మధ్య ఆ తగాదా చాయలు కొద్దికొద్దిగా పాకడం ప్రారంభించాయి. వాటికన్నిటికీ పుల్లీ పరిష్కారం చూపించి తీరుతుందని అతను గంపెడాశతో ఈ సారి వచ్చాడు.

తన తల్లి పక్కని కూర్చుని పుల్లీ కాళ్ళు చాపుకుని వెనకటి కబుర్లు చెబుతో ఎల్లా అసలు సంగతి ఎత్తుతుందో ఏమీ నొప్పి తగలకుండా ఎల్లా మనస్సు మెత్తగా చేసేస్తుందో అంతా అతను ఇదివరకు ఊహించుకున్నాడు. ఈ లోకంలో మంచి ఏదుంటే దానికంతకీ ప్రమాణం పుల్లి. పుల్లి ఒక దేవత. అతని జీవితాన్ని సవ్యంగా నడిపించడానికి ఈ లోకంలో పుట్టింది. పుస్తకాల్లో చదివే మాతృ దేవతకు ఆమె అవతారంలాగ అతనికి అనిపించేది. ఆమెకు ఒక మొగుడూ, పిల్లలూ ఉన్నారన్న సంగతి అసలు రంగనాథం మరిచిపోయాడు.

పొద్దున్న సంగతి అంతా కళ్ళారా చూసిన తరవాత, అతనికి పుల్లిమీద తీరని ఈసు, కోపం వచ్చాయి. తనని ఇన్నాళ్ళూ ఆమె మోసగించినట్టు అతనికి అనిపించింది. ఈమె ఇల్లాంటిదని ఇన్నాళ్ళూ ఎందుకు తెలియలేదు?

అతని భార్య పక్కని మెదిలింది. ఆమె స్పర్శ అతనికి కొంచెం ఉక్కిరి బిక్కిరిగా ఉంది. ఆమె అంది :

"ఏమండీ! పుల్లీని మనం తీసికెడదామా?....దాన్ని అడిగానండి. అది మీరు సరేనంటే వస్తానంది ... అత్తయ్య కూడా ఏమీ అనదు."

"ఎందుకు అక్కడికి? రంకుముండ?"

"చాల్లెద్దురూ, ఏం మాటలు?"

"పొద్దున్న గొడవంతా విన్నావుగా?"

"ఏదో దాని గొడవ దానిది. మన్నేమన్నా అది బాధించిందా? పోనీ ఇదేమన్నా కొత్త విషయం గనకనా. దాని మొగుడు అసలు మొదు అవతారం..."

"చాల్లే! ఊరుకో....నాకు నిద్ర వస్తోంది."

ఆమె కాస్సేపు అల్లాగే పడుకుని తరవాత లేచి పక్క మంచంమీదకి పోయి పడుకుంది.

అయితే ఆ సంగతి అందరికీ తెలుసును! తనకే తెలియదు! ఏమిటీ వింత? తన భార్యకూ తెలుసును. అయినా ఎంత చనువుగా, ప్రేమగా పుల్లి పక్కని కూర్చొని మాట్లాడుతోంది! ఈ పల్లె టూళ్ళలో ఇంతే. నీతి లేదు. సంఘం అంతా కుళ్ళి పాడయిపోతోంది. ఏమీ ప్రమాదం జరగలేదన్నట్టుగా. ఆ సంగతి అంత ముఖ్యమయినది కానట్టుగా మాట్లాడతారేం అందరూ?

అతనికి క్రమంగా ఆలోచనలు చెదిరిపోయి దారీతెన్నూ లేకుండా తిరుగుతున్నాయి. పట్నంలో చక్కగా దుస్తులు ధరించిన స్త్రీలు, వాళ్ళ తెలివి తేటలు, ఎంత చనువయినా కొంచెం దూరంగా అట్టేపెట్టే సంస్కారం ఒక పక్కనీ; పల్లెటూళ్ళు. గడ్డి మేట్ల పక్కని వ్యభిచారాలు, ఆ విషయమయి సిగ్గుపడకుండా అతినిర్లక్ష్యంగా మాట్లాడ్డం, సంస్కారం లేని మోటా హాస్యాలు రెండో పక్కనీ కలగాపులగంగా అతని మనస్సులో దొర్లిపోతు న్నాయి. అతనికి క్రమంగా నిద్రపట్టింది.

* * * *

అది పల్లెటూరో పట్నవాసమో చెప్పడానికి వీలులేదు. పెద్ద చింత చెట్టుంది. దానికింద రేడియో పాడుతోంది. ఒక టేబిలు చుట్టూ పదిపదిహేను మంది కూర్చుని టీ సేవిస్తున్నారు. అందులో తక్కిన వారెవరో అతనికి

గుర్తులేదు. అతని పక్కనే ఒక యువతి కూర్చుంది. ఆమె ముఖం ఎల్లాఉందో అతనికి స్పష్టంగా తెలియదు. ఆమె మాత్రం ఆదర్శప్రాయ. ఆమె హృదయం అతి విశాలమయినది. ఆమెకు ఈ లోకంలో తెలియని విషయం లేదు. కాని ఆమెతో ప్రస్తావించిన విషయం ఏమిటో అతనికి గుర్తులేదు. అతని మనస్సు దూదిపింజలా ఉద్రేకంతో పైకి ఉబికింది. కొంతసేపయిన తరవాత అతడూ, ఆమే ఒక కాలవగట్టు మీదనించి నడిచిపోతున్నారు. అంతా సినీమాలలో చూసే దృశ్యంలాగ ఉంది. నీటిమీద కలవ ఆకులున్నాయి. నీటిలో కలవపువ్వులున్నాయి. చటుకుని కాలవ చెరువులాగ అయిపోయింది. పక్కని ఒక కొత్తగడ్డిమేటి ఉంది. ఇద్దరూ ఆ గడ్డిమేటి పక్కకి పోయి కూర్చున్నారు. అతడు ఆమె పక్కలో పేలెట్టి పొడిచాడు. ఆమె విరగబడి నవ్వింది. అతడామెను గట్టిగా కౌగిలించుకున్నాడు. పక్కని ఎక్కడో ఆవులు కదిలిన ధ్వని.

"పుల్లీ" అన్నాడు ఇంకా గట్టిగా కౌగిలించుకుంటో.

"రంగన్న బాబుకి మతొయిందా" అంది పుల్లీ అతన్ని మెల్లగా నిమురుతు. అతని వొళ్లంతా దూదిలా తేలికగా అయిపోయింది. పుల్లి చిన్న పిల్లలాగ, పెద్ద తల్లిలాగ, అతన్ని ఆవరించింది. చెరువులో అతని ముఖం ఆకారణంగా ప్రతిఫలించింది. అందులో పుల్లెంకడున్నాడు. ఇంతలో చటుకుని పుల్లి మొగుడు అన్నాడు "రా! మక్కలిరగదంతాను."

* * * *

అతనికి ముచ్చెమటలు పోశాయి. ఊపిరి ఆడలేదు. కిటికీలో దీపం ఆరిపోయింది, అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. అతడు తడుముకుంటో లేచి పక్కమంచం మీదికిపోయి తన భార్యని గట్టిగా అదుముకుని పట్టుకుని పడుకున్నాడు.

(ఆంధ్రపత్రిక; ఉగాది 1945)